క్లుప్తంగా

అభివృద్ధికి నోచుకోని గ్రామాలు

సీతంపేట: మండల పరిధిలోని పలు గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని గిరిజన సంఘ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.తిరుపతిరావు, సహాయ కార్యదర్శి బి. సాయికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగంవలస, ద్వారబంధం గ్రామాల్లో కనీస మౌలిక వసతులు లేవని పేర్కొన్నారు. గిరిజనాభివృద్ధిపై ఐటీడీఏలో పలుమార్లు సమీక్ష చేస్తున్నా ప్రజా ప్రతినిధులు గాని పాలకులు గాని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిరిజన గ్రామాల్లో మౌలిక వసుతులు కల్పించాలని కోరారు.

డంపింగ్‌యార్డు సమస్య పరిష్కరించాలి

పాలకొండ : నగర పంచాయతీలో డంపింగ్ యార్డు సమస్యను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు ఆదివారం ఒక ప్రకటలో కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్య పరిష్కరిస్తామని ప్రకటించి, ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. చెత్తను పట్టణంలోని పలు సెంటర్ల వద్ద పోగు వేస్తున్నారని, ప్రధానంగా వెంకటరాయుని కోనేరు గట్టుపై చెత్త పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అధికారులు, పాలకవర్గ సభ్యులు సమన్వయంతో పనిచేసి డంపింగ్ యార్డును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ కురుపాం కోఆర్డినేటర్‌గా అడ్డాకుల



గుమ్మలక్ష్మీపురం: కురుపాం అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్‌గా అడ్డాకుల చిన్నారావును నియమిస్తూ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు వై.ఎస్ షర్మిలారెడ్డి ఈనెల 2న ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా చిన్నారావు ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఇకపై కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.

వాహన తనిఖీలు

పాలకొండ రూరల్: నిషేధిత గుట్కా, గంజాయి, సారా తరలింపు చట్టరీత్యా నేరమని స్థానిక సీఐ మీసాల చంద్రమౌళి అన్నారు. వీటి రవాణాను అడ్డుకునే క్రమంలో ప్రత్యేకంగా ఆదివారం ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు, ఉత్ప్రేరకాల వినియోగం అనర్థదాయకమన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

జమిలీ ఎన్నికలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

- సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు



మాట్లాడుతున్న సీపీఎం నాయకుల

గుమ్మలక్ష్మీపురం: పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ, స్థానిక సంస్థలకు ఏకకాలంలో(జమిలి) ఎన్నికలు నిర్వహించాలనే కేంద్ర కేబినేట్ నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో పార్టీ నాయకులు కోలక అవినాష్, మండంగి రమణతో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఒకే దేశం.. ఒకే ఎన్నిక అన్నది ఆర్ఎస్ఎస్, బీజేపీల మానస పుత్రిక అని, ఒకే నాయకుడి సారధ్యంలో ఉండే ఏకీకృత రాజ్య వ్యవస్థను ఏర్పాటు చేయాలని వారు కోరుకుంటున్నారని విమర్శించారు. ఒకే దేశం, ఒకే మతం, ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే నాయకుడు అన్న నినాదానికి ఇది కొనసాగింపు మాత్రమేనని, ఇది బీజేపీ ఫాసిస్టు దృక్పథాన్ని తెలియజేస్తుందన్నారు. జమిలి ఎన్నికల నమూనాను అమలు జరిపితే రాజ్యాంగం మౌలిక పునాదులైన ప్రజాస్వామ్యం, సమాఖ్య విధానాలు దెబ్బతింటాయన్నారు. ఈ విధానాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ(మార్కిస్టు) పూర్తిగా వ్యతిరేకిస్తోందని, ప్రజాస్వామ్యం, సమాఖ్య విధానాన్ని కోరుకునే ప్రతీ పార్టీ దీన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు.

పోరాటమే సమస్యలకు పరిష్కారం

పార్వతీపురంటౌన్: స్థానిక జూనియర్ కళాశాలలో యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ సంబరాలను ఆదివారం నిర్వహించారు. డీఈఓ కార్యాలయం నుంచి జూనియర్ కళాశాల వరకు ఉపాధ్యాయులు ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.రమేష్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కేఎస్ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోరాటాలే సమస్యలకు పరిష్కారమని సమ్మిన సంఘం యూటీఎఫ్ అన్నారు. ప్రభుత్వాలు విద్యారంగాన్ని కార్పొరేటీకరణ చేస్తున్నాయన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల జేఏసీ చైర్మన్ ఏపీ నాగేశ్వరావు మాట్లాడుతూ కాంట్రాక్టీకరణ విద్యారంగంలో ఎక్కువ అయిందని, ఇది సరికాదన్నారు. కాంట్రాక్టు ఉపాధ్యాయులను, లెక్చరర్లను, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, మినిమమ్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

అజాగ్రత్త తగదు..



నాగావళి తీరంలో పవిత్ర స్నానాలు చేస్తున్న భక్తులు

- ఉధృతంగా నాగావళి నది
- కార్తీకంలో సంప్రదాయంగా కొనసాగుతున్న నదీ స్నానాలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు

పాలకొండ రూరల్: ఎంతో పవిత్రమైన కార్తీకమాసంలో నదీ స్నానాలకు అత్యధిక ప్రాధాన్యం ఉంటుంది. ఈ మాసంలో శైవక్షేత్రాలను దర్శించుకోవడానికి భక్తులు ఉత్సుకత చూపిస్తారు. అందులో భాగంగా నదీ స్నానాలు చేయడం, తెప్ప దీపాలు వదలడం, సమీపంలోని దేవాలయాల్లో దీపాలు వెలగించి దైవదర్శనం చేసుకోవడం ముక్తికి మార్గాలుగా భావిస్తారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలతో నీటి వనరుల్లో జలకళ సంతరించుకోవడంతో నీటిప్రవాహం అధికంగా ఉంది. దీంతో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాల బారినపడక తప్పదు. గతేడాది కార్తీకమాసంలో పాలకొండ మండలం మంగళాపురం గ్రామానికి చెందిన ఆర్.అచ్చియ్య అనే వృద్ధుడు నాగావళి నదిలో స్నానం చేసేందుకు వెళ్లి మత్యువాత పడ్డాడు. ఆదే ఏడాది సమీప రేగిడి మండలం కందిశకు చెందిన ఆర్. శారద నదిలో గల్లంతై మృతి చెందింది. తాజాగా యరకారాపురంలో ఓ యువకుడు నదిలో గల్లంతయ్యాడు.

విస్తరించి ఉన్న నదీతీరం ...

పాలకొండ, రాజాం, ఆమదలవలస నియోజకవర్గాల పరిధిలో నాగావళి నదీతీరం విస్తరించి ఉంది. ఈ తీరం వెంబడి అనేక పుణ్య క్షేత్రాలు, దేవాలయాలు ఉన్నాయి. కార్తీక మాసంలో పెద్ద సంఖ్యలో భక్తులు ఈ నదీ తీరంలో స్నానమాచరించడం పరిపాటి. దీనికి తోడు మాలధారణ చేసిన అయ్యప్ప, శివ, భవానీ స్వాములు కూడా పుణ్య స్నానాలు చేస్తుంటారు. ముఖ్యంగా నాగావళి నదీ తీరానికి ఆనుకుని ఉన్న పాలకొండ మండలం యరకారాయపురం, చిన్న, పెద్ద మంగళాపురాలతో పాటు గోపాలపురం, అన్నవరం, అంపిలి గ్రామాల్లో ఉన్న భక్తులు ప్రస్తుతం నదీ స్నానాలు విరివిగా చేస్తున్నారు. అలాగే వీరఘట్టం మండల పరిధిలో నందివాడ, తలవరం, మొట్ట, కిమ్మి, బిటివాడ, తదితర గ్రామాల ప్రజలు, ఆలయాలకు వెళ్లే భక్తులు నాగావళి నదిలో పవిత్ర స్నానాలు చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో అధిక వర్షాల కారణంగా తీరంలో నీటి ప్రవాహం అధికంగా ఉంది. ఈ ప్రవాహంతో సుడులు, విపరీతమైన లోతుతో కూడిన మడుగులు ఏర్పడ్డాయి. మరోవైపు ఇసుక సేకరణ పేరిట నిబంధనలకు విరుద్ధంగా, విచ్చలవిడిగా తీరం వెంబడి తవ్వకాలు జరుపుతున్నారు. ఈ క్రమంలో అజాగ్రత్తగా ఉంటే ప్రమాదం తప్పదని అనుభవజ్ఞులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి భక్తులు, స్వాములు లోతు తక్కువ ఉన్న ప్రాంతాల్లో, అక్కడి స్థానికుల సూచనల మేరకు స్నానాలు చేయడం, దీపాలు వదలడం మంచిది.



గోపాలపురం వద్ద నదీ తీరంలో స్నానపు ఘాట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మెట్లు

పోలీసుల పర్యవేక్షణ అవసరం.....

నాగావళి నదీ తీరంలో స్నానమాచరించేందుకు ప్రత్యేకించి ఎటువంటి ఘాట్‌లు లేవు. ఏయే ప్రాంతాల్లో స్నానాలు చేయవచ్చో తెలిపే బోర్డులు కూడా లేవు. దీంతో భక్తులు ఇబ్బందులు, ప్రమాదాల బారిన పడుతున్నారు. పోలీసులు స్పందించి స్నానమాచరించేందుకు తగు స్థలాలను గుర్తించి బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

బోర్డులు ఏర్పాటు చేయాలి..



తీరం వెంబడి గల శైవ క్షేత్రాల వద్ద పవిత్ర స్నానాలు చేసేందుకు వీలైన ప్రదేశాలు గురించాలి. అక్కడ పాటించాల్సిన నిబంధనలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు స్పందించాలి.

బొత్స గౌరు, విశ్రాంత ఉద్యోగి, పాలకొండ మండలం

అప్రమత్తంగా ఉండాలి..



నదీ తీరంలో పవిత్ర స్నానాలు చేసేవారు.. ఆధ్యాత్మిక, వనభోజనాలు చేసే వారు అప్రమత్తంగా ఉండాలి. భక్తులు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. నిబంధనలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తున్నాం. సమస్యలు తలెత్తితే తక్షణమే 100కు సమాచారం అందించాలి. ఎం.రాంబాబు, డీఎస్పీ, పాలకొండ.

కార్తీక దీపార్చన..



నక్కలపేటలో కొలువుదీరిన షిర్డీ సాయి మందిరంలో ఆదివారం కార్తీక దీపార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు పర్రి శరత్‌కుమార్ ఆధ్వర్యంలో మహాశివునికి ప్రత్యేక పూజలు, భజనలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ ఆకృతుల్లో దీపాలు వెలిగించారు.

– పాలకొండ రూరల్

దిష్టిబొమ్మలా రక్షిత పథకం ..



ఏజెన్సీలోని రామనగరం గ్రామంలో గల రక్షిత మంచినీటి పథకం దిష్టిబొమ్మలా వెక్కిరిస్తోంది. దీంతో గిరిజనులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. సుదూర ప్రాంతంలోని కొండపైన గ్రావిటేషన్ నీటిపైన ఆధారపడుతున్నారు. గోలుకుప్పగూడ, చింతలగూడ, రామానగర్‌కాలనీ, జాతాపు రామానగర, పెద్దగూడ గ్రామాల ప్రజలు కూడా గ్రావిటేషన్ నీటిని తాగుతూ జ్వరాల బారిన పడుతున్నారు. అధికారులు దృష్టి సారించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– సీతంపేట

జోరుగా టేకు కలప అక్రమ రవాణా



భామిని మండలంలో టేకు కలప అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఏబీ రోడ్డుకు అందుబాటులో ఉన్న టేకు తోటల నుంచి దుంగలను తరలించుకుపోతున్నారు. నేరుగా వాహనాలతో వచ్చి మర రంపాలతో చెట్లను నరికి గంటల వ్యవధిలో దుంగలతో పరారవుతున్నారు. కొంతమంది స్థానికులు చూసినా వారిని ఎదురించడానికి భయపడుతున్నారు. రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు అక్రమార్కులపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

– భామిని

తుప్పల తొలగింపు..



పాలకొండ – సీతంపేట రహదారిలో కుశిమి జంక్షన్ వద్ద రోడ్డుకిరువైపులా ఉన్న తుప్పలు, డొంకలను జేసీబీ యంత్రంతో పోలీసులు ఆదివారం తొలగించారు. రహదారి పక్కన పిచ్చి మొక్కలు ఎపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక అనేక ప్రమాదాలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఎస్సై అమ్మన్నరావు ఆధ్వర్యంలో పిచ్చి మొక్కలు తొలగించడంతో వాహనచోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– సీతంపేట

సైబర్ నేరాలపై అప్రమత్తం



గరుగుబిల్లి: సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రమేష్‌నాయుడు



కిచ్చాడలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై నారాయణరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కురుపాం ఎస్సై పి.నారాయణ అన్నారు. మండలంలోని కిచ్చాడ, వెంకటాపురం గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించి గ్రామస్తులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ గేమ్స్, ఆఫర్లు, లక్కీడ్రాల పేరుతో సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. అపరిచితులతో బ్యాంకు ఖాతా నంబరు, ఓటీపీ, పిన్ వివరాలు పంచుకోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు.


బ్యాంకు వివరాలు పంచుకోవద్దు

గరుగుబిల్లి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై పి.రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని టీఆర్ఎన్‌వలసలో ఆదివారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అపరిచితులకు బ్యాంకు ఖాతాల వివరాలను ఎట్టిపరిస్థితుల్లో ఇవ్వొద్దని సూచించారు. మీ ఖాతాను అప్‌డేట్ చేయాలంటూ వచ్చిన ఫోన్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అటువంటి ఫోన్ కాల్స్‌పై 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. లాటరీ తగిలిందని తప్పుడు మెయిల్ పంపించి పెద్ద ఎత్తున కొల్లగొట్టే సందర్భాలున్నాయన్నారు. అత్యాశకు పోయి ఉన్న సంపదను పోగొట్టుకోవద్దన్నారు. ప్రతీ ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, రహదారి నియమాలను పాటించాలని కోరారు. చిన్నారులు, మహిళలపై అకృత్యాలకు పాల్పడితే పోక్సో కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం దళాయివలస–టీఆర్ఎస్‌వలస రహదారి మలుపు వద్ద పిచ్చిమొక్కలను తొలగించి, హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేశారు.

బ్రహ్మాస్త్రంతో ఎన్నో ప్రయోజనాలు

భామిని: ఐదు రకాల ఆకులతో తయారు చేసే బ్రహ్మాస్త్రం కషాయంతో ఎన్నో ప్రయోజనాలున్నాయని ఏపీసీఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనీ మోటక అంభోజీ అన్నారు. మండలంలని నులకజోడులో ఐసీఆర్‌పీ వలరౌతు ప్రభాకర్ సారథ్యంతో బ్రహ్మాస్త్రం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, మహిళా రైతులు పాల్గొన్నారు.

మొగనాళి గెడ్డలో పర్యాటకుల సందడి



జలపాతం వద్ద జలకాలాడుతున్న సందర్శకులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ పంచాయతీ పరిధిలోని మొగనాళి గెడ్డ జలపాతం వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన యువత, చిన్నారులు, పెద్దలు జలపాతంలో జలకాలాడుతూ ఉత్సాహంగా గడిపారు.

బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, నిత్య పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ పర్యవేక్షణలో అర్చకులు ఎస్.శ్రీనివాసరావు, రఘుశాస్త్రి ఆధ్వర్యంలో జైగురుదత్త హోమ పూజలు, శ్రీచక్ర అర్చన, మహాలింగార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హిరమండలం, చింతాడ, వీరఘట్టం, ఆకులకట్ట, గిజబ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కురుపాంలో సీపీఎం జిల్లా మహాసభలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): సీపీఎం జిల్లా మహాసభలను వచ్చే నెల 10, 11 తేదీల్లో కురుపాంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు వెల్లడించారు. కురుపాం మండలం డి.బారామణి గ్రామంలో సీపీఎం మండల కమిటీ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతాంగ పోరాట గడ్డ కురుపాం మండల కేంద్రంలో సీపీఎం జిల్లా మహాసభలు నిర్వహించాలని జిల్లా కమిటీ నిర్ణయించిందని, జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన నాయకత్వం, జిల్లా నాయకత్వం హాజరౌతారని తెలిపారు. 1993లో జిల్లా మహాసభలు ప్రారంభంలో గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించడం జరిగిందని, మరలా అదే స్ఫూర్తితో కురుపాంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గోడ పత్రికలు, కరపత్రికలు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు మండంగి అడ్డమేశ్వరరావు, బిడ్డిక భాస్కరరావు, కె.తిరుపతిరావు, ఎం.వెంకటరావు, వైకుంఠరావు, బాలరాజు పాల్గొన్నారు.



బారామణిలో జిల్లా మహాసభల పత్రికను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

పోటీతత్వం తప్పనిసరి

వీరఘట్టం: విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని సిక్కోలు గణిత ఉపాధ్యాయుల సంఘ సభ్యుడు సూరు సతీష్ అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గణిత ప్రతిభా పరీక్షను ఆయన పర్యవేక్షించారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులు 215 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో ప్రతి తరగతి నుంచి ఏడుగురు విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

ఈ నెల 17న జిల్లా స్థాయి ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గర్భాన శ్రీనివాసరావు, టి.నగేష్, విజయకృప, కె.శివప్రసాద్, శ్రీనివాస్ పండా, వి.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా పరీక్షలో సత్తాచాటిన విద్యార్థులతో గణిత ఉపాధ్యాయులు

అఖండ శివ నామస్మరణ..



అన్నవరంలో వెలసిన ఉమారామలింగేశ్వర ఆలయంలో ఆదివారం శివ స్వాములు అఖండ నామస్మరణ కార్యక్రమం చేపట్టారు. పవిత్ర నదీ తీరాల నుంచి జలాలను సేకరించి స్వామివారికి జలాభిశేకం నిర్వహించారు. అనంతరం అరటి దవ్వలపై స్వామికి హారతులిచ్చారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

– పాలకొండ రూరల్

అక్షయపాత్ర నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

పార్వతీపురం: గిరిజన ఆశ్రమ పాఠశాలలకు, వసతి గృహాలకు అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా ఆహారం సరఫరా చేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉప సంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ గేటు వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల దీక్షలు ఆదివారం కొనసాగాయి. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ నాయకుడు వెంకటరమణ మాట్లాడుతూ షరతులను చూపించి విద్యార్థులకు అందించే సంక్షేమ పథకాల్లో కోతలు విధిస్తున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రాజు, డి.పండు మాట్లాడుతూ వసతిగృహాల్లోనే వంటలను తయారు చేసి వేడివేడి పదార్థాలను విద్యార్థులకు అందించాలన్నారు.



ప్రతిబింబం చూసి మురిసిన సూరీడు..

సాయం సంధ్యవేళ పవిత్ర నాగావళీ నదీ తీరంలో ప్రకృతి అందాలు ఆవిష్కృతమవుతున్నాయి. ఈ దృశ్యాలు చూపరులను కట్టి పడేస్తున్నాయి. గొట్ట మంగళాపురం వద్ద ఆదివారం సాయంత్రం భానుడు బంగారువర్ణంతో కాంతులీనుతూ కనిపించాడు. తన ప్రతిబింబం నగావళి నదీ తీరంలో చూస్తూ మురిసిపోయాడు. ఈ ప్రకృతిసోయగాన్ని పలువురు తమ సెల్‌ఫోన్లలో బందించారు.

– పాలకొండ రూరల్